క్లుప్తంగా

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యను చర్చిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి



సబ్‌జైలులో అధికారులతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

నరసాపురం: ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయ కేంద్రం ద్వారా అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కేసులు, వివరాలు ఆరాతీశారు. రిమాండ్ ఖైదీలకు నిబంధనలకు అనుగుణంగా సబ్‌జైలులో సదుపాయాలు ఏర్పాటు చేయాలని జైలు అధికారులను ఆదేశించారు. ఖైదీలకు వైద్య సదుపాయాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ఆయన వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు ఉన్నారు.

వేతనాలివ్వాలని ఉపాధి కూలీల ధర్నా



కొడమంచిలిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

పెనుగొండ: ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగాచెల్లించకపోతే కూలీలు ఏవిధంగా బతకుతారంటూ కౌలు రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆచంట మండలం కొడమంచిలి తురకవానిమెరకలో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుని, సక్రమంగా జీతాలు చెల్లించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనారావు, బండి రంగారావు, మచ్చ సుబ్బారావు, ఇంజేటి వీరయ్య, కారుపల్లి రాజు, కారుపల్లి పరంజ్యోతి, ఇంజేటి నరసింహమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాదంలో మహిళకు గాయాలు

భీమవరం: పట్టణంలోని జువ్వలపాలెంలో రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన జి.నాగమణి గాయపడింది. ఆమె భీమవరం పట్టణంలోని ఒక ల్యాబ్‌లో పని చేస్తుండడంతో విధి నిర్వహణ కోసం ఆమె యాక్టివా స్కూటర్‌పై వస్తుండగా వస్తుండగా మరొక మోటారు సైకిల్ ఢీకొట్టడంతో గాయాలపాలైంది. బాధితురాలు ప్రస్తుతం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ మోహన్‌రావు కేసు నమోదు చేస్తున్నారు.

పల్లె కన్నీరు పెడుతుందో..!



సరిపల్లి గ్రామ సచివాలయంలో కేవలం నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్న దృశ్యం



నరసాపురం మండలం సరిపల్లిలో తాళం తెరవని రైతుభరోసా కేంద్రం



తూర్పుపాలెంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాల సముదాయం

- కూటమి పాలనలో గ్రామస్వరాజ్యం కనుమరుగు
- ఏడాదిలో ఎంతో విధ్వంసం

నరసాపురం: పల్లెలే దేశ ప్రగతికి పట్టుకొమ్మలని మహాత్మాగాంధీ ఆకాంక్షించారు. గ్రామస్వరాజ్యం కోసం ఆయన అహర్నిశలు పరితపించారు. గాంధీజీ ఆశయ సాధన దిశగా 2019–24 మధ్య రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకురావడం ద్వారా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య విధానానికి బాటలు వేశారు. పంచాయతీల్లో గ్రామ సచివాలయాలు, మున్సిపాలిటీల్లో వార్డు సచివాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ పాలలను ఇంటి వద్దకే జగన్ ప్రభుత్వం తీసుకొచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర సాటుతుఉండటంతో సచివాలయాల్లో గతం మాదిగా పనులు సాగడంలేదు. సిబ్బంది సమయానికి రావడంలేదు. అర్జీలు పట్టుకుని ప్రజలు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. జగన్ ప్రభుత వెళ్లి, కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాదిలో ఎంతమార్పు వచ్చిందని జనం వాపోతున్నారు. మళ్లీ ఆ నాటి రోజులు ఎప్పుడొస్తాయా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

కన్నీరు పెడుతున్న తీరగ్రామాలు..

19 కిలోమీటర్లు సముద్రతీరం నరసాపురం నియోజకరవ్గంలో ఉంది. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 23 గ్రామాలు పూర్తిగా సముద్రాన్ని ఆనుకుని ఉన్నాయి. నరసాపురం మున్సిపాలిటీ కూడా గోదావరిని ఆనుకుని ఉంది. ముఖ్యంగా సముద్రతీర గ్రామాల వారు అధికారులతో ఏ చిన్న అవసరం పడినా 10 నుంచి 30 కిలోమీటర్లు మేర దూరం ఉన్న నరసాపురంటౌన్‌కు రావాల్సిందే. అయితే తీరగ్రామాల్లో సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, విజేల్‌క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో వారంతా సంతోషించారు. అయితే ఈ ఏడాదిలో మళ్లీ పాతరోజులు, పాత కష్టాలు మొదలు కావడంతో తీర ప్రాంత గ్రామాలు కన్నీరు పెడుతున్నాయి. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హయాంలో 39 సచివాలయభవనాలు, 38 రైతు భరోసా కేంద్రాల భవనాలు, 33 వీహెచ్‌సీలు నిర్మించి వాటి ద్వారా పూర్తిస్థాయిలో సేవలందించారు. ఇప్పుడు కనీసం సచివాయాల్లో పూరిస్థాయిలో సిబ్బందిలేని పరిస్థితి. ఉదాహరణకు సరిపల్లి సచివాలయంలో 11 సిబ్బంది కాగా ప్రస్తుతం 8 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అందులో మళ్లీ ముగ్గురు డిప్యూటేషన్‌పై వెళ్లారు. మిగిలిన 5 గురు కూడా రీసర్వే పనుల్లో తిరగడంతో సచివాయం ఖాళీగా దర్శనిమిస్తుంది.

ఆచంట నియోజకవర్గంలో..

గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం స్వతంత్ర వచ్చి ఎన్ని సంవత్సరాలు దాటినా నెరవేరలేదు. అరవై ఏళ్ల దాటినా రూపురేఖలు మారని పల్లెలు. కేవలం అయిదేళ్లలో మారిపోయాయి. కళకళలాడే ప్రభుత్వ భవనాలు, పేదలకు అందుబాటులో ఉన్న బడులు రూపురేఖలు మారిపోయాయి. దీంతో పల్లే మారి పోయింది. 2018 నుంచి 2024 వరకూ గ్రామాల్లో స్వర్ణయుగం నడిచింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టగానే పల్లెలు పులకరించాయి. ఇరుకు గదుల్లో నడిచే పంచాయతీలు విశాలమైన సచివాలయ భవన నిర్మాణాలతో మారిపోయాయి. జగనన్న కాలనీలతో కొత్త ఊళ్లు గ్రామాలను తలపించే విధంగా ఏర్పడ్డాయి. ఒక్క ఆచంట నియోజకవర్గంలోనే రూ.10 కోట్ల 40క్షలతో 26 సచివాలయ భవనాలను పూర్తి చేశారు. మరో 16 సచివాలయాలు నిర్మాణ దశలో ఉన్నాయి. రైతు సేవా కేంద్రాలు 35 కేంద్రాలకు గానూ రూ.4 కోట్ల 18లక్షలతో 26 భవనాలు పూర్తిచేశారు. మరో రూ.3కోట్ల 52 లక్షలతో 16 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అదే విధంగా ప్రజారోగ్యం కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లు 28కి గానూ రూ.3 కోట్ల 75లక్షలతో 15 హెల్త్ క్లినిక్‌లు నిర్మాణం పూర్తి చేశారు. మరో రూ.3కోట్ల 25లక్షలతో 13 భవనాలు నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ఎన్నికల సంవత్సరం కావడంతో నిర్మాణాలు పూర్తి కాలేదు. గతంలో పల్లెల్లో ప్రభుత్వ భవనాలు అద్దె కొంపల్లోనే ఉండేవి. వాటికి చరమ గీతం పాడి ప్రభుత్వ భవనాలకు సొంతగూడు కల్పించి పల్లేల రూపురేఖలు మారిపోయాయి.

నాడు సువర్ణయుగం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పల్లెలకు సువర్ణయుగం లాంటింది. పంచాయతీలకు సచివాలయ వ్యవస్థతో సొంత భవనాలు ఏర్పాటు చేశారు. విద్య వైద్యం కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి కొత్త భవనాలు ఏర్పాటు చేశారు. పల్లెల్లో అభివృద్ధి బాటలు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఎటువంటి భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టలేదు.

– గుబ్బల వీర బ్రహ్మం, తూర్పుపాలెం

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కాన్ సెంటర్‌లు, వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. బుధవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన నరసాపురం సబ్‌డివిజనల్ లెవెల్ మల్టీ మెంబర్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కాన్‌సెంటర్‌లు సీజ్ చేస్తామన్నారు. మొదటి సారి తప్పుచేసిన వైద్యుల సర్టిఫికెట్‌ను భారత వైద్యమండలి నుంచి 5 సంవత్సరాలు తొలగించడం, 3 ఏళ్లు జైలు శిక్ష, రూ.50 వేలు ఫైన్ ఉంటుందన్నారు. అదే తప్పుచేసి రెండవసారి దొరికితే భారత వైద్యమండలి నుంచి సదరు వైద్యుడు ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను శ్వాతంగా రద్దు చేయడంతో పాటు 5 ఏళ్ల జైలుశిక్ష, భారీ ఫైన్ పడుతుందని హెచ్చరించారు. స్కాన్ సెంటర్‌లపై సంబంధిత అధికారులు నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రసాద్, ఈగల్ ఎక్స్‌పర్ట్ చల్లా దానయ్యనాయుడు, వైద్యులు డాక్టర్ జెట్టి గణేష్ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ



మునిసిపల్ కార్యాలయంలో యోగా చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: యోగా చేయడం వల్ల అన్ని సమస్యలకు పరిష్కారమే కాకుండా మానసిక ఉత్సాహం కలుగుతుందని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి అన్నారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో యోగా దినోత్సవం నెల రోజుల వేడుకల్లో భాగంగా ఇంజనీరింగ్ భవనంపై సమావేశ మందిరంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. అలాగే శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఎంతగానో దోహదపడతాయన్నారు. యోగా శిక్షకులు యోగా ఆసనాలతో శిక్షణ ఇచ్చారు. మునిసిపల్ ఆర్‌ఐ బదరీ యోగా శిక్షణలో సిబ్బందిచే పలు ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ వీరబ్రహ్మం, డీఈ రాజ్‌కుమార్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో వరంగల్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: వర్గీకరణపై గత 30 ఏళ్లుగా పోరాటం చేసి విజయం సాధించిన మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు రావడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నబాబు అన్నారు. బుధవారం స్థానిక మార్కెటింగ్ యార్డులో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ పద్మశ్రీ అవార్డు అందుకుని వరంగల్ వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 31న చలో వరంగల్ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వచ్చి మందకృష్ణకు ఘన స్వాగతం పలకాలన్నారు. మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు రావడం జాతికి ఎంతో గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పసల బోసు, పినందబాబు, యార్లగడ్డ రత్నరాజు, టి.శ్రీను, యు ప్రభాకర్, సిహెచ్ శరత్, కొల్లి రాజశేఖర్, టి.రాంబాబు, టి శేఖర్, మోషే, సిద్దుల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సిల్ట్ తొలగింపు పనులు



డ్రెయినేజీలో తొలగించిన సిల్ట్

పాలకొల్లు సెంట్రల్: న్యూక్లాత్ మార్కెట్‌లో డ్రెయినేజీలో సిల్ట్ తొలగింపు పనులు రెండో రోజు బుధవారం కూడా కొనసాగాయి. షాపులు ముందు ఎవరికి వారే ఏర్పాటు చేసుకున్న పార్కింగ్ టైల్స్‌ను నిర్మూలన చేసి సిల్ట్‌ను తొలగించారు. గతంలో ఎప్పుడు ఈ ప్రాంతంలో డ్రెయినేజీలో సిల్ట్ తీయాలన్నా ఎవరికి వారే తమ షాపు వద్ద రాళ్లు తీయవద్దని ఒత్తిళ్లు తీసుకురావడంతో తూతూ మంత్రంగానే సిల్ట్‌ను తొలగింపు ఉండేది. నేడు ఆ పరిస్థితి లేకుండా షాపులు ముందు డ్రెయినేజీని పగులగొట్టి సిల్ట్‌ను తొలగించారు. ఈ ఒక్క రోడ్డులో సుమారు పది ట్రాక్టర్ల సిల్ట్ ఉంటుందని పారిశుద్ధ్య కార్మికులు చెబుతున్నారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి డ్రెయినేజీ పనులను మరోసారి పరిశీలించారు.

రేషన్‌ను సక్రమంగా అందించాలి



పెనుగొండలో రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు అనితకుమారి

పెనుగొండ: మండలంలో నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా అందించాలని పెనుగొండ మండల తహసీల్దారు జి.అనితకుమారి అన్నారు. బుధవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయంలో డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా 1 నుంచి 15 వరకూ సరుకులు పంపిణీ చేయడానికి దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. రేషన్ పంపిణీ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించకుండా దుకాణాలు నిర్వహించాలని సూచించారు.

మానసిక వైద్యశాలల సందర్శన

భీమవరం: పట్టణంలోని మానసిక వైద్యశాలలను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కె.రత్నప్రసాద్ సందర్శించారు. వర్మ హాస్పిటల్స్, శాంతి, ప్రశాంతి మానసిక వైద్యశాలలను సందర్శించి రోగుల మానసిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు న్యాయపరమైన సూచనలు, సలహాలు అవసరమైతే స్థానికంగా ఉన్న మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చున్నారు. కార్యక్రమంలో వర్మ హాస్పిటల్స్ మానసిక వైద్యురాలు శ్రీదేవి, శాంతి మానసిక ఆసుపత్రి వైద్యుడు జీవీ రమణరావు పాల్గొన్నారు.

2న ఇళ్ల స్థలాల కోసం ధర్నా

భీమవరం: ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం ఇచ్చిన జీఓను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. బుధవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో నిర్వహించిన ఇళ్ల స్థలాల సాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఏడాది పాలనలో అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని రంగారావు విమర్శించారు.